

# ఒక దెయ్యంతో నా ప్రేమకథ

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



### (పునర్ముద్రణ)

అంకితం

అపరాధ పరిశోధన (డిటెక్టివ్) నవలని తెలుగు పాఠక లోకానికి పాపులర్ చెయ్యటంలో ఆద్యుడు

**కొమ్మూరి సాంబశివరావు కి**

\- రచయిత

## కృతజ్ఞతలు:

దెయ్యం తపున ఒక లాయరు కేసు టేకప్ చేసిన కథాంశం తో నవల వ్రాయమని సూచన ఇచ్చిన ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ, మానసిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఇండ్ల విశాల్, రాగమాలికల వివరణ చెప్పిన గొర్తి బ్రహ్మానందం, పురాణ, ఇతిహాసాసాల గురించి వివరించిన బాలాంత్రపు రమణ, ఇంటరాగేషన్ విధానాల గురించి వివరించిన రిటైర్డ్ ఐ.పి.యస్ ఆఫీసర్ శ్రీరావులపాటి సీతారామారావు, లీగల్ సమాచారం అందజేసిన లాయర్ గోపాల్ సింగ్, ఫేస్-బుక్ గురించి వివిధ వివరాలు చెప్పిన వి.వి.ఆర్.కిషన్, ఎ.ఐ. ఇన్ఫర్మేషన్ ఇచ్చిన అల్లాణి శ్రీధర్,

కలీమా, జకాత్ ల గురించి చెప్పిన ఖాదిర్ బాబు,ఎందఱో మహానుభావులు. అందరికీ కృతజ్ఞతలు.

...

ఇదో చందమామ కథ. ఆస్తిక-నాస్తిక-దెయ్యాల చర్చ వద్దు.

\- యండమూరి

# (ప్రారంభం)

**బల్ల** మీద చేతులు ఆన్చి ముందుకు వంగి, “నేను నిన్న రాత్రి రెండింటికి చనిపోయాను డాక్టర్...” అన్నాను.

బల్లకి అవతలి వైపు ఉన్న సైకాలజిస్టు నావైపు కన్నార్పకుండా చూశాడు. అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. నాకన్నా చిత్రమైన భ్రమలతో, విచిత్రమైన వ్యాధులతో, దరిద్రమైన బాధలతో, నిర్హేతుక అనుమానాలతో వచ్చిన మానసిక వ్యాధిగ్రస్తులని ఆయన చాలామందిని చూసి ఉంటాడు కాబట్టి అలా అభావంగా చూడటంలో నాకేమీ చిత్రం అనిపించ లేదు. అయితే, నాకూ వారికీ తేడా ఏమిటంటే...

నేను నిజంగా చనిపోయాను.

“మీ పేరు?” అన్నాడు.

“ఆనంద్”.

డాక్టరు నా వైపు తేరిపార చూసి, “మీరు ఫాల్కీవాలా కదూ” అన్నాడు.

నాకు ఒళ్ళు మండింది. “కాదు. ఆనంద్. లాయర్ ఆనంద్” అన్నాను పళ్ళు బిగపట్టి.

“అదే. ఆనంద్ పాల్కీవాలా. ఈ నగరంలోనే ది ఫేమస్ లాయర్” అన్నాడు.

ఆ పొగడ్త నాకేమీ సంతోషం కలిగించలేదు. నా పేరుని పాల్కీవాలాగా మార్చింది మా ఇంటి ఆస్థాన సలహాదారు అద్భుతానందస్వామి. అతడి అసలు పేరు సుబ్బారాయుడు. స్వామీజీగా మారాక అలా మార్చుకున్నాడు. నేను ‘లా’లో చేరే ముందు, న్యూమరాలజీ లెక్కలు వేసి నా పేరు వెనుక ‘పాల్కీవాలా’ అని తోక తగిలించింది అతడే..!

మా ఇంట్లో అందరికీ స్వామీజీ మాట వేదవాక్యం.

మా నాన్న గత వైభవం కాస్త మిగిలిన జమిందారు. ఇందిరాగాంధీ రాజ భరణాలు రద్దు చేశాక, మాకు కాస్త డబ్బుతో పాటూ, పెద్దల వారసత్వమైన పెద్ద మండువా లోగిలి మిగిలింది. ఆ దివాన్ దేవిడీలో మా నాన్న, స్వామి అర్ధరాత్రి వరకూ కూర్చుని భూతానికీ, దెయ్యానికీ మధ్య తేడా గురించి గంటల తరబడి చర్చించుకుంటారు. మా నాన్న మందు కొడతాడు. స్వామీజీ నాన్న ముందు కొట్టడు.

మా నాన్నకి జ్యోతిష్యం, వాస్తు, పేరులో ప్రధమాక్షరం, న్యూమరాలజీ, తాళపత్రం, నాడీ జ్యోతిష్యం, గత జన్మ, మరు జన్మ, రాహుకాలం, శకునం, దెయ్యాలు, చేతబడి, భూత వైద్యం, ప్రేత శుద్ధి, పాతళ కుట్టి, పిశాచ పీడనం, మొదలైన వాటిపై నమ్మకం ఎక్కువ.

నాన్న సురాపానం చేస్తూ ఉండగా, స్వామీజీ ఎంతో ‘జ్ఞాన’వమనం చేస్తాడు. పిడుగు అర్జునుడి బాణమనీ, భూమి గుండ్రంగా ఉన్నదని కనుక్కున్నది ఉత్తర ధ్రువ ప్రాంత ఎస్కిమోలనీ, ఆంజనేయుడు అస్ఖలితుడు కాదనీ ఆయన చెపుతూ

ఉంటే, మా నాన్న ‘పి.కే’ సినిమాలో హీరోయిన్ తండ్రి పరీక్షిత్ సహానీలా ఒళ్ళంతా చేమంతి పూలంత కళ్ళు చేసుకుని వింటూ ఉంటాడు.

మా అమ్మకి కూడా స్వామీజీ మాట వేదవాక్యం. గుర్రానికి కొమ్ములు ఉంటాయని స్వామీజీ చెబితే, ప్రపంచంలో అన్ని జంతువులకీ కొమ్ములుంటాయని నమ్మేటంత సాధ్వి. అక్షరాలా నాన్న అడుగు జాడల్లో నడుస్తుంది. అంతవరకూ ఎవరికీ అభ్యంతరం లేదు గానీ బదరీనాథ్ వెళ్ళినప్పుడు, భర్త అడుగు జాడలు మంచులో కనపడక చాలా బాధ పడిందట.

మా అమ్మ ప్రతి రోజూ ప్రొద్దున్న లేవగానే నాన్న మంచం క్రిందకు దూరుతుంది. పది నిముషాల తరువాత అలసిపోయి బయటకు వచ్చి కాఫీ తాగుతుంది. మీరేమీ అపార్థం చేసుకోకండి. మా అమ్మ గురించి అలా ఆలోచిస్తే కళ్ళు పోతాయి.

మాది పదేళ్ళ పిల్లాడెత్తు పురాతన కాలపు పందిరి మంచం. మా నాన్న చెప్పులు ఆ మంచం క్రింద ఉంటాయి. జమిందారీ వంశం కదా. మొత్తం ఎనిమిది జతల చెప్పులు. ***‘పొద్దున్న లేవగానే మొగుడి చెప్పులు తుడిస్తే స్వర్గప్రాప్తి లభిస్తుందని భాగవతంలో వాల్మీకి వ్రాశాడమ్మా’*** అని మా అద్భుతానందస్వామి ప్రవచనం చెప్పాడు. అప్పటి నుంచీ అమ్మ ప్రతి రోజూ తెల్లార్నే మంచం క్రిందికి దూరి నాన్న ఎనిమిది జతల చెప్పులూ తుడిచి, ఆపై తన దినచర్య ప్రారంభిస్తుంది.

ఇదంతా చూసి నాకు ఒళ్ళు మండక ఛస్తుందా? భాగవతంలో చెప్పుల ప్రసక్తి లేదనీ, భాగవతం వ్రాసింది వాల్మీకి కాదనీ, ఆయన వ్రాసింది రామాయణం అనీ... అందులో చెప్పుల ప్రసక్తి ఉన్నా, భరతుడు వాటిని తీసుకెళ్లింది సింహాసనం మీద పెట్టి పాలించటానికే తప్ప, భార్య చేత పాలిష్ చేయించటానికి కాదనీ– వాదించాను. అయినా నా మాట ఎవరు వింటారు?

నా జీవితంలో ఏదైనా విషాదం ఉన్నదంటే అది అద్భుతానంద స్వామే. నాకు వరూధినీ గండం ఉన్నదనీ, ఇంతకాలం పెళ్లి కాకపోవటానికి అదే కారణమనీ, కేరళ రాష్ట్రంలో ‘మాయంకొట్టు మాలం చెరువు మలంద’ లో నెలకొని ఉన్న శకుని గుడి ముందు ఆరువారాల పాటూ ‘నగ్నం’గా వంటాముదంతో తైలస్నానం చేయిస్తే తప్ప వివాహం జరగదనీ చెప్పాడు. ఆరు బయట అందరు జనాల మధ్య చిన్న గోచీతో ఆముద స్నానం చెయ్యనని నేనంటే అమ్మ ఒకటే ఏడుపు. అమ్మ ఏడిస్తే నేను చూడలేను. ఏం చెయ్యను?

మొన్న సాయంత్రమే ఈ విషయమై ఆయనకీ నాకూ పెద్ద గొడవ జరిగింది. మనసు పాడై అవే ఆలోచనలతో పక్క చేరాను. అర్ధరాత్రి గుండెల్లో నొప్పిగా అనిపించింది. యాంగ్జయిటీ వల్ల వచ్చిన గ్యాస్టిక్ ట్రబులేమో అనుకున్నాను. నా శరీరం గాలిలో తేలటం ప్రారంభించాక కాదని తెలిసింది.

అప్పటికే నేను మరణించి అయిదు నిముషాలు అయింది.

– 2 –

“**సో...** మీరు మరణించి మళ్ళీ బ్రతికానంటారు” అన్నాడు డాక్టర్–కమ్– సైకాలజిస్ట్–కమ్–కౌన్సిలరు. అవునన్నాను.

“మరి ఈ విషయం మీ ఇంట్లో వారికి చెప్పారా?”

“లేదు”

“ఎందుకు?”

‘మాకో బాబా ఉన్నాడు. నన్ను మళ్ళీ బ్రతికించింది తనే అని చెప్పి, మరో ఎకరం కొల్లగొడతాడు’ అందామనుకున్నాను కానీ, ‘ఇంట్లో విషయాలు బయట చెప్పుకునేవాడు ఆ తరువాతి జన్మలో... కొత్తగా పెళ్ళయిన దంపతుల పడగ్గది కలుగులో... ఆడ జత లేని పందికొక్కుగా పుడతాడు’ అని విన్నాను. ఇలాంటి ప్రవచనాలు నేను నమ్మను గాని, రిస్క్ ఎందుకని ముక్తసరిగా “వాళ్ళు కంగారు పడతారని చెప్పలేదు” అని అన్నాను.

“మిస్టర్ ఆనంద్. మీకు చచ్చి బ్రతకటాల మీద నమ్మకం ఉన్నదా?”

“లేదు. ఛస్తూ బ్రతకటం మీద ఉన్నది. చాలామంది చేసేది అదే”

“అడిగినదానికి చెప్పండి చాలు. దెయ్యాలూ భూతాల మీద నమ్మకం ఉందా?”

“నాకు తెలీదు”.

కౌన్సిలర్‌కి నా మాటలు అర్థం కాలేదు. “అంటే...?” అని అడిగాడు.

“వాస్తు, జ్యోతిష్యం, న్యూమరాలజీ, గతజన్మ... ఇవన్ని ఉన్నాయో లేదో నాకు తెలియదు” అన్నాను.

“మీరు నమ్ముతారా? నమ్మరా? అది చెప్పండి”.

“న్యూయార్కులో మహాత్మాగాంధీ స్ట్రీట్ ఉన్నదా?”

మొహం చిట్లించి “నాకు తెలీదు” అన్నాడు.

“ఉన్నదని మీరు నమ్ముతారా? నమ్మరా? అది చెప్పండి”.

“అరే... నాకు తెలియని విషయాన్ని నేనెలా చెప్తాను?” అన్నాడు డాక్టరు విసుగ్గా.

“మరి నేను చెప్పేదీ అదే. దెయ్యము, జ్యోతిషమూ ఇవన్నీ ఉన్నాయో లేదో నాకు తెలియదు. నాకు తెలియని విషయాన్ని నేనెలా చెపుతాను?”

“మీరు చాలా ‘మెగలోమానియాక్’ లా ఉన్నారు”

అది తిట్టో పొగడ్తో అర్థం కాక "అంటే?" అన్నాను.

"తమ అభిప్రాయాలే కరెక్ట్ అంటూ, తమకి తాము మేధావులమని నమ్ముతూ, తాము చెప్పింది ఎవరైనా వ్యతిరేకిస్తే విరుచుకు పడేవారిని 'మెగలో-మానియాక్'లంటారు".

"అవును. ఫేస్‌బుక్‌లో ఎక్కువ కనపడతారు" అన్నాను.

అతడు నా మాటలు పట్టించుకోలేదు. "అందులో 'అంటాగోనిస్టిక్ మాలిగ్నెంట్ నార్సిజం' మరీ ప్రమాదం. వెంటనే దానికి మీకు ట్రీట్‌మెంట్ ఇవ్వాలి" అన్నాడు.

పెద్దపెద్ద పారిభాషిక పదాలు వాడుతూ క్లయింట్స్‌ని అయోమయంతో బెదర గొట్టటమనే వ్యాపార టెక్నిక్ నాకూ తెలుసు కాబట్టి తాపీగా, "ఎదుటివారితో అభిప్రాయబేధం రాగానే నేను వాదించటం మానేస్తాను. నన్నేమంటారు?" అని అడిగాను.

సరైన పదం దొరక్క, "సర్లెండి. మొత్తానికి లాయర్ అనిపించారు. నిన్న ఏం జరిగిందో చెప్పండి" అన్నాడు.

చెప్పటం మొదలు పెట్టాను.

యమధర్మరాజు నన్ను ఎగాదిగా చూసి, భటుల వైపు తిరిగి "ఇంత పొరపాటు ఎలా జరిగింది?" అన్నాడు కోపంగా.

నాకు సంతోషం వేసింది. అయితే ఆ సంతోషం నన్ను వెనక్కి పంపుతున్నందుకు కాదు. పుణ్యాత్ములైన జీవులకు యముడు సౌమ్యుడు గానూ; పాపులకు మాత్రం అరుణారుణ నిర్వ్యక్త రుద్రాభిషిక్త నేత్ర రుధిర రక్త వర్ణ నాలుకతో, నిక్క బొడుచుకున్న వెంట్రుకలతో కనబడతాడని స్కందపురాణంలో ఉన్నదని మా అమ్మ చిన్నప్పుడు నాకు చెప్పింది. ప్రస్తుతం నాకు ఆ పెద్దాయన (అంటే యముడు) మామూలుగానే కనపడ్డాడూ అంటే... లాయరునై ఉండీ నేను పుణ్యాత్ముడినే అన్నమాట..! అందుకూ సంతోషం వేసింది..!!

ఈ లోపు ఆ దక్షిణ దిశాధిపతి, "అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పరేం? ఇంత పొరపాటు ఎలా జరిగింది?" అని భటులని గద్దించాడు.

"మీరేమీ అనుకోకపోతే నేను చెప్తాను" అన్నాను. చెప్పమన్నట్టు చూశాడా సమవర్తి.

"మీ దగ్గరకి నన్ను తీసుకు వస్తున్నప్పుడు గమనించాను. నా మెడ చుట్టూ వేసిన యమపాశం వదిలేసి ఒకడు వాట్సప్పులో భటురాలితో ఛాటింగ్ చేస్తున్నాడు. మరొకడు ఫేస్‌బుక్ ప్రొఫైల్ పిక్కు మారుస్తున్నాడు. ఈ హడావుడిలో ఇంకెవడినో తీసుకురాబోయి నన్ను తీసుకొచ్చారు" అన్నాను.

నా పక్కనే నిలబడ్డ భటుడు, యముడికి వినబడకుండా “ఒరేయ్. నిన్ను ఖండ ఖండాలుగా కోసి సలసలా కాగే నూనెలో వేయించక పోతే నేను యమభటుడినే కాను” అన్నాడు.

“ఏడిశావు. ఆత్మని ముక్కలు చెయ్యటం ఏమిట్రా?” అన్నాను.

“మూర్ఖుడా...” అన్నాడు వాడు. “ఆత్మకి స్థూల–సూక్ష్మ–కారణ అని మూడు శరీరాలు ఉంటాయి. గూగుల్ చూడు. నీ భవిష్యత్తు తెలుస్తుంది”.

“నీ భవిష్యత్తు నేను చెప్తా విను. ఇప్పుడు మీ బాస్ మీకు తలంటుతాడు” అన్నాను. నేనన్నట్టే ఆ దైవస్వంతుడు వాళ్ళని తల వాచేటట్టూ చివాట్లు పెట్టి, నన్ను తిరిగి వెనక్కి తీసుకుపోయి, అసలు వ్యక్తిని తీసుకు రమ్మన్నాడు.

ముగ్గురం కలిసి క్రిందికి వస్తూండగా, వారిని అనునయిస్తున్నట్టూ “మీరేమీ బాధ పడకండి. మాకిది కొత్త కాదు. చాలా సినిమాల్లో ఇలాగే జరిగింది. పోతే నాకు హీరోయిన్ లేదు. అంతే తేడా” అన్నాను.

భటులు మాట్లాడలేదు. వాళ్ళు డల్‌గా ఉండటం చూసి హుషారు చేయటానికి, “మీ లోకానికి ఎవరు ఎక్కువ వస్తారు? పాపులా? భక్తులైన స్మగ్లర్లా? తరచూ పుణ్య క్షేత్రాలకి వెళ్ళే పొలిటికల్ లీడర్లా?” అని అడిగాను.

“నోర్మూసుకుని నడువు” అన్నాడు వారిలో ఒకడు. లాయర్‌ని కదా. సాక్షుల చేత ఎలా మాట్లాడించాలో నాకు బాగా తెలుసు. వాళ్లకి ఉత్సాహమున్న టాపిక్ ప్రారంభించాను.

“కింద బూలోకంలో మేము ఫేస్‌బుక్కులో ఎక్కువగా రాజకీయాలూ, ఎన్నికలూ, రేప్‌లూ, సినిమాలూ చర్చిన్చుకుంటాం. నచ్చని వారిని ట్రోలింగూ, నచ్చినవారిని సపోర్టూ చేసుకుంటాం. కథలూ కవితలూ వ్రాసుకుంటాం. మా నమ్మకాలతో మాకు మేమే జడ్జిమెంట్లు ఇచ్చుకుంటాం. ఇక్కడ యమలోకంలో కులాలూ, రేప్‌లూ ఉండవుగా? మీరేం మాట్లాడుకుంటారు?” అని అడిగాను.

బాణం కరెక్టుగా తగిలింది. నచ్చే టాపిక్ వచ్చేసరికి వాళ్ళు హుషారయ్యారు. “...స్వర్గంలో ఉండేది మంచోళ్ళు కాబట్టి వాళ్లకి అంతగా విశేషాలు ఉండవు. నరకంలో మా దగ్గర బోల్డు విశేషాలు. దేవుళ్ళనీ దేవతలనీ తిడతాము. మా లోకంలో నారదుడని ఒకడున్నాడు తెలుసా? వాడి మీద బోలెడు జోకులు వేస్తాము”.

“నారదుడి మీద జోకులా?” అన్నాను ఆశ్చర్యంగా. నాకు దేవుళ్ల గురించి ఎక్కువ తెలీదు. కానీ నారదుడి గురించి తెలుసు. నాకు జ్ఞాపక శక్తి ఎక్కువ. సెల్ఫ్–డబ్బా అనుకోక పోతే... ఐ.పి.సి సెక్షన్లన్నీ కంఠతా వచ్చు. నగరంలో నేను నెంబర్ వన్ లాయర్‌గా ఎదగటానికి అదే కారణం.

నారదుడి గురించి మా తెలుగు మాష్టారు చెప్పిన ప్రతి వాక్యమూ సజీవంగా గుర్తుంది. యుగాంతంలో సమస్త లోకాలూ సమూలంగా అంతమయిన తరువాత, అఖండ జలరాశి మధ్యలో బ్రహ్మదేవుడు వేయి యుగాల పాటూ విశ్రాంతి తీసుకుంటాడట. ఆ బ్రహ్మశ్వాసలో లీనమై పోయిన నారదుడు, మళ్ళీ బ్రహ్మ నిద్ర లేచి తిరిగి లోకాలను సృష్టించడం ప్రారంభించినపుడు, ఆయన ఊపిరి నుంచి మళ్ళీ జన్మిస్తాడట. అలా బ్రహ్మశ్వాస నుంచి జన్మించినాడు కాబట్టి విష్ణువు మనవడు బ్రహ్మమానస పుత్రుడయినాడు.

మా మాస్టారు చెప్పేవారు: "నారదుడు సామాన్యుడైన ఋషి కాదు. వేదోపనిషత్తుల చదివి, సాంఖ్యయోగ విభాగములు, కల్పాతీత విశేషముల నెఱిగి, శిక్షా కల్ప వ్యాకరణముల నౌపోసన బట్టిన మేధావి. సంగీత విశారదుడు. పండితులూ, జ్ఞాన శ్రేష్టులూ, విద్వాంసుల సందేహములు కూడా తీర్చగల ప్రతిభాశాలి" అని.

పొట్ట కోస్తే అక్షరం రాని ఈ నిరక్షరకుక్షులు, అంతటి మహానుభావుడిని 'వాడు, వీడు' అని సంబోధించటం, సృష్టి-స్థితి-లయకారులపై చౌకబారు జోకులు వెయ్యటం కేవలం ఫేస్‌బుక్ ప్రభావమని బాధ అనిపించి **"ఇలా మాట్లాడినందుకు మీకు శిక్షలుండవా?" అని అడిగాను.**

**"మాకు మరణాలూ, శిక్షలూ ఉండవు" గర్వంగా అన్నాడు వారిలో ఒకడు. "...కానీ మీ మనుష్యులకి ఉంటాయి. మొన్న మీ లోకం నుంచి వచ్చిన ఒక పాపి, తన ఫెస్బుక్కులో మీ మాజీ ప్రధానమంత్రిణిని 'ఇదీ-అదీ' అని అగౌరవంగా తిట్టాడు. ప్రస్తుత దేశ ప్రధానిని 'వాడూ-వీడు' అన్నందుకూ; బుద్ధుడిని బూతుమాటతో సంబోధించినందుకూ, వాడి తాలూకు మిగతా పాప పుణ్యాలేవీఁ పరిశీలించకుండా, కేవలం ఆ నేరానికి కాలసూత్ర నరక శిక్ష విధించాడు మా రాజు".**

"**కాలసూత్ర?** అంటే?"

"**నరక శిక్షలలోకి అన్నిటి కన్నా భయంకరమైనది..!** నెత్తిన సూర్యుడు నిప్పులు కురిపిస్తూ ఉండగా, రాగి నేల మీద పడుకోబెట్టి ఒక్కొక్క అంగమూ కోసేస్తారు. శేష శరీరాన్ని సలసలా కాలుతూన్న నూనెలో వేయిస్తారు. ప్రాణం ఇంకా పోని ఆ మిగిలిన బొందని పాముల కన్నా ఘోరంగా హింసించే రౌరవులు అనే జంతువుల మధ్య విసిరేస్తారు" అని అతడు చెపుతూ ఉంటే నా ఆత్మ జలదరించ లేదు. మనిషి హీన సంస్కారానికి అది సరైన శిక్షే అనిపించింది..!

మొదటి భటుడి మాటలు నేను శ్రద్ధగా వినటం గమనించి రెండోవాడు కల్పించుకుని, "ఇక్కడ నరకంలో మేము ఫేస్‌బుక్కులో ఏమి మాట్లాడుకుంటామని నీ అనుమానం కదా. స్వర్గం ఇక్కడికి దగ్గరే కదా. అక్కడ రంభా ఊర్వశీ మేనకల నాట్యాన్ని మొన్న రాత్రి మేము..." అంటూ ఉత్సాహంగా ఏదో చెప్పబోతూ ఉంటే, ఇద్దరు భటులు ఒక వ్యక్తిని ఎదురుగా తీసుకు వస్తూ కనిపించారు.

"అతనేనా?" అని అడిగాను. అవునన్నారు. సన్నగా పీలగా ఉన్నాడు. కుర్రాడిలాగానే ఉన్నాడు. నా వయసే ఉంటుంది. కళ్ళు మాత్రం తీక్షణంగా ఉన్నాయి. దాదాపు నా పోలికలతోనే ఉన్నాడు. అందుకే భటులు బహుశా పొరబాటు పడి ఉంటారు.

అతడిని ఎక్కడో చూసినట్టు అనిపించి "పేరేమిటి? ఏం చేస్తూ ఉంటాడు?" అని అడిగాను.

"ప్రభాకర్. జర్నలిస్టు" అన్నారు భటులు.

"కుర్రవాడు. పాపం పెళ్లి అయిందా? పిల్లలున్నారా?" జాలిగా ప్రశ్నించాను.

"నీకెందుకు?"

"ఏదో జాలితో అడుగుతున్నాను"

"నోర్మూసుకుని నడువు. యమలోకంలో జాలి, దయా ఉండవు" అని భటుడు అంటూ ఉండగా, ప్రభాకర్ నా సమీపంలోకి వచ్చాడు. ఇద్దరం ఒకర్నొకరం ఎదురెదురు క్రాస్ అయ్యే సమయంలో భుజాలు 'ఢీ' కొన్నాయి.

"కాస్త చూసుకుని నడవలేవా?" కోపంగా అన్నాడు ప్రభాకర్.

"ఆ మాట నీకూ వర్తిస్తుంది కదా" అన్నాను.

"నేను ఎడమ వైపు నడుస్తున్నాను".

"ఇండియాలో ఎడమ. అమెరికాలో అయితే కుడి. అయినా అవన్నీ భూమ్మీద బ్రో. ఆకాశంలో ఆ రూల్సు ఉండవు" అన్నాను. లాయర్ని కదా.

అతడు నన్ను గుర్తు పట్టలేదనుకుంటాను. దెబ్బ తిన్నట్టు చూసి, 'వెధవ సంత' అంటూ కోపంగా గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

(అలా మేము 'ఢీ' కొట్టుకోవటమే నా జీవితంలో ఒక గొప్ప మలుపుకి కారణం అవుతుందని అప్పట్లో నాకు తెలీదు).

అతడు వెళ్లిన వైపే చూస్తూ, "మీ లోకంలో దయ, కరుణ ఉండవన్నారు సరే. మంచి, మర్యాదలు కూడా ఉండవా?" అన్నాను.

'మాట్లాడకు' అంటూ వీపు మీద ఫెడీల్మని పాశంతో కొట్టాడు. ఆ మంటకి మెలకువ వచ్చి చూస్తే నేను నా బెడ్రూమ్‌లో ఉన్నాను. వీపు తడువుఁ కుంటే మామూలుగానే ఉంది. అప్పటికే బారెడు పొద్దెక్కింది. నేనెప్పుడూ అంత ఆలస్యంగా లేవలేదు.

– 3 –

“**అదీ** జరిగింది” అన్నాను. నేను చెపుతున్నంత సేపూ డాక్టరు నోట్–బుక్కులో ఏదో వ్రాసుకుంటూనే ఉన్నాడు. ఆయన అలా వ్రాసుకోవటం నాకేమీ ఆశ్చర్యం అనిపించలేదు. క్లయింట్ జేబూ, అతడి పట్ల మేము వినియోగించే శ్రద్ధా– అనులోమానుపాతంలో ఉంటాయి. డబ్బున్న క్లయింట్ చెప్పే దాంట్లో మ్యాటర్ ఏమీ లేకపోయినా నేనూ అంతే శ్రద్ధగా వ్రాసుకుంటాను.

ఆయన వెనుక నిల్చున్న ఆల్చిప్ప కళ్ళ సెక్రటరీ నా వైపు విప్పారిన కళ్ళతో చూస్తోంది. అమ్మాయి బావుంది గానీ, అది నా పట్ల ఆకర్షణ కాదనీ, యమధర్మరాజుని చూసి వచ్చిన వాడిని తను చూస్తున్నానన్న థ్రిల్లనీ గ్రహించి, నేనంత ఇంటరెస్టు చూపించలేదు.

ఈ లోపులో సైకాలజిస్టుగారు తలెత్తి “మిస్టర్ ఆనంద్. ఇప్పుడు మీరు నా దగ్గరకి ఎందుకు వచ్చారు?” అని అడిగాడు.

ఈ ప్రశ్న నాకు బాగా నచ్చింది. సమయం వృధా కాకుండా మా లాయరు వృత్తిలో కూడా ఈ తొలి ప్రశ్నతోనే సంభాషణ మొదలు పెడతాం. చెప్పటం మొదలు పెట్టాను.

“ఈ రోజు పొద్దున్నే నేనూ, నా జూనియర్ రామకృష్ణా చాలా వాదించుకున్నాం. ‘ఇది కలే...’ అంటాడు రామకృష్ణ. నాది కల కాదనీ, నేనేమీ మానసిక రుగ్మతతో బాధ పడటం నేననుకుంటున్నాను. నాది కలకాదని కనీసం మీరైనా నమ్మాలి”.

అర్థం చేసుకున్నట్టు కౌన్సిలరు తలూపాడు.

“నిజ్జంగా నరకం వెళ్లాను సార్. కానీ... నరకం నుంచి వెనక్కి వచ్చాక అద్దంలో వెనక్కి చూసుకున్నాను. వీపు మీద దద్దులు లేవు. యమభటులు ఛర్నాకోలాతో కొట్టినప్పుడు చాలా మంట పెట్టింది. కానీ భూమ్మీదకు రాగానే వాతలుకనబడ లేదు. అంతకన్నా ముఖ్యమైనది– నరకంలో ఫేస్‌బుక్కులూ, వాట్సాప్పుల టాపిక్ నిజమా? నా భ్రాంతా? మాలో ఎవరు కరెక్టు? నేనా? నా జూనియరా? ఈ అనుమాన నివృత్తి కోసమే మీ దగ్గరకొచ్చాను.”

బోనులో ముద్దాయి చేతులు జోడించి, ‘...నేను చెప్పేదంతా నిజమే. నన్ను నమ్మండి’ అని జాలిగా వేడుకొన్నప్పుడు, జడ్జీ అతడి వైపు ఎలా అభావంగా చూస్తాడో– అలా చూశాడు కౌన్సిలర్.

“అంతే కాదు డాక్టరుగారూ. నరకం నుంచి వచ్చినప్పటి నుంచీ నా చెవిలో ఎవరో ‘...హలో... హలో... బావున్నావా బ్రో...’ అంటున్నారు.”

ఆయన చాలాసేపు దీర్ఘాలోచనలో ఉండి, గాఢంగా ఊపిరి వదులుతూ, "మీరు మల్టీ పెర్సనాలిటీ ఆడిటరీ డిజార్డర్ హెలూసినేషన్స్ విత్ ఒసిడీ కంపలషన్స్ తో బాధ పడుతున్నారు మిస్టర్ పాల్కీవాలా" అన్నాడు.

జడ్జీ 'నీకు ఉరిశిక్ష వేస్తున్నా' అన్నప్పుడు క్లయింట్ దీనంగా ఎలా చూస్తాడో అలా చూశాను.

"మీరు నరకాన్నీ, దెయ్యాల్నీ నమ్మరు కదా" అన్నాడు.

"నమ్మను. నాకింకా పెళ్లి కాలేదు" అన్నాను.

"మీరో స్ప్లిట్ పెర్సనాలిటీ. మీలో ఇద్దరు ఆనంద్‌లు ఉన్నారు. ఒక ఆనంద్ 'లాజిక్'నీ, మరొక ఆనంద్ 'నరకాన్నీ' నమ్ముతాడు. మనం ఏమైతే నమ్మమో, అవే కల్లోకి వస్తాయి. 'స్కిజోఫ్రేనిక్ సైకోసిస్' లో అదొక భాగం.".

"కానీ ఇంతకు ముందు ఎప్పుడూ ఇలా రాలేదండీ" అన్నాను దీనంగా.

నా వైపు ఆయన కూడా జాలిగా చూస్తూ, "ప్రతి దానికీ ప్రారంభం అనేది ఒకటుంటుంది ఆనంద్. ఇదే ప్రారంభం..." అన్నాడు. "...మీ జీవితంలోకి దెయ్యాలు రావటమనేది ఇంకా ముందు ముందు ఎక్కువ అవుతుంది".

"అలా రావటం వల్ల ప్రమాదం ఉంది అంటారా?"

"చాలా ఉంది. ఇలా తరచూ దెయ్యాలూ భూతాలూ రావటాన్ని '*అబ్సెసివ్ కంపల్సివ్ డిసార్డర్*' అంటారు. ఇది ఒక *సైకో సొమాటిక్* వ్యాధి. అది వచ్చిందంటే రోగి ప్రవర్తన మొదట్లో చిత్ర విచిత్రంగా మారుతుంది. భార్యని మరదలనుకుంటాడు. మరదల్ని గత జన్మ స్నేహితురాలు అనుకుంటాడు. అది మరింత ప్రమాదకరమైన *స్కిజోఫ్రెనియా*కి దారి తీస్తుంది. ఆ *బైపోలార్ డిసార్డర్* క్రమక్రమంగా *పారనాయిడ్ ఆంగ్జయిటీ సింద్రోమ్* గా మారి.."

అతడు మరి కొన్ని రోగాల పేర్లు చెప్పక ముందే కంగారుగా, "మరి దీనికి ట్రీట్‌మెంటు?" అని అడిగాను.

"ఆరు నెలల పాటు వారానికోసారి మా క్లినిక్‌కి రావాల్సి ఉంటుంది. మేము మీకు కౌన్సిలింగ్ చేస్తాం. అప్పుడప్పుడు హిప్నటైజ్ కూడా చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా ఈ *ట్రామాటిక్ డిప్రెసివ్ డిల్యూషన్స్*...." అంటూ అతను మరో నాలుగు పేర్లు చెప్పబోతూ ఉండగా కుర్చీలోంచి లేచి "ఫీజు?" అని అడిగాను.

"మామూలుగా అయితే రెండు లక్షలు. మీరు పేరున్నవారు కాబట్టి లక్షకే ట్రీట్ చేసి మళ్ళీ మామూలు మనిషిని చేస్తాము".

"హిప్నాటిక్ ట్రీట్‌మెంటుకి కాదు. ఇప్పుడీ కన్సల్టేషనుకి."

కౌన్సిలర్ మొహం వాడిపోయింది. హైపో–కాండ్రియాసిస్ డిస్మార్ఫిక్ డిసార్డర్ పేషెంట్ లా “అయిదొందలు” అన్నాడు.

ఫీజు ఇస్తూ, “ఒక్క విషయం డాక్టరుగారూ. ఈ విషయం బయటకి రాకుండా చూడండి. సరీగ్గా ఇలాంటి అవకాశం కోసమే మా ఇంట్లో ఒక రాహువు కాచుకుని కూర్చున్నాడు. నేనిలా చచ్చి బ్రతికానని తెలిస్తే శాంతి పేరిట మా వాళ్లతో లక్షలు ఖర్చు పెట్టిస్తాడు” అన్నాను.

“బయటకి రాదండీ” అని తన ఆల్చిప్ప కళ్ళ సెక్రటరీ వైపు తిరిగి, “రాదు కదా” అన్నాడు.

“ఏ విషయం?” అన్నదామె. మా రామకృష్ణలాగే ఆమె కూడా మంచి సెక్రటరి అనుకుంటూ కుర్చీలోంచి లేచాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments